సికింద్రాబాద్‌లో చరిత్రను తిరగరాస్తాం

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్

ముషీరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలిచి చరిత్రను తిరగరాస్తామని బీఆర్ఎస్ అభ్యర్థి టి. పద్మారావుగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం ముషీరాబాద్ డివిజన్‌లోని బాపూజీనగర్ నుంచి ఎన్నికల ప్రచారాన్ని ఎమ్మెల్యే ముఠాగోపాల్‌తో కలిసి పద్మారావుగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పద్మారావుగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు ఓటు వేస్తే వృథా అవుతుందని, ఆయన ఓడిపోవడం ఖాయమని అన్నారు. బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి ఐదేళ్లు అందుబాటులో లేడని, ఆయనకు మరోసారి ఓటు వేస్తే మరో ఐదేళ్ళు కనిపించడని అన్నారు. ఇలాంటి నాయకులు మనకు వద్దని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రేటర్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ, ముషీరాబాద్ ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పార్టీశ్రేణులు పనిచేయాలి

నల్లకుంట, మే 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ గెలుపే లక్ష్యంగా పార్టీశ్రేణులు సైనికులుగా పనిచేయాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం నల్లకుంట డివిజన్ బీఆర్ఎస్ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ హయంలో ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజాబాహుళ్యంలోకి తీసుకెళ్లాలని సూచించారు.



ముషీరాబాద్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

చిక్కడపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ శనివారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పద్మారావుగౌడ్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నేతలు జైసింహ, ముదారపు రాకేశ్‌కుమార్, డీఆర్ రామ్‌చందర్, బోనం బన్ని, ఎస్టీ ప్రేమ్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, శ్రీధర్‌రెడ్డి, పున్న సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): మచ్చలేని నాయకుడు, జనం మనిషి పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం రాంనగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు చూసి ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు.



దానం నాగేందర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్ యాదవ్, జ్యోతి తదితరులు



ముషీరాబాద్ చౌరస్తాలో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ విజయం ఖాయం

సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్

ముషీరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజల అండదండలతో సికింద్రాబాద్ ఎంపీగా విజయం సాధిస్తానని పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం ముషీరాబాద్‌కు చెందిన ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు ఆధ్వర్యంలో ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు ప్రభాకర్ యాదవ్, మాజీ వార్డుమెంబర్ జ్యోతితోపాటు 50 మంది కాంగ్రెస్‌లో చేరారు. వారికి దానం నాగేందర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ పేద ప్రజలకు అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు విశ్వనాథ్, చంద్రకళ, లక్ష్మిబాయి, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి రోడ్‌షో

ముషీరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా శనివారం సాయంత్రం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ముషీరాబాద్ చౌరస్తాలో ఇరువైపుల జనంతో కిక్కిరిసిపోయింది. సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు సికింద్రాబాద్ అభ్యర్థి దానం నాగేందర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీలు అంజన్‌కుమార్ యాదవ్, హజారొద్దీన్, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ యాదవ్, సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ముషీరాబాద్ చేపల మార్కెట్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దానం నాగేందర్‌ను గెలిపిస్తే కేంద్ర మంత్రిని చేసే బాధ్యత నాదే అని అన్నారు. లక్ష మెజార్టీతో దానం నాగేందర్‌ను గెలిపించాలని కోరారు.



ప్రచారం నిర్వహిస్తున్న అభిషేక్ కెన్నడీ తదితరులు

దానంను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాం

చిక్కడపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): దానం నాగేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తున్నామని గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ తెలిపారు. శనివారం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నాగేందర్‌ను గెలిపించాలని కోరుతూ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాదయాత్రలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు శీలం సత్యనారాయణ, గుర్రం శంకర్, కెన్నడీ రాజు, జయేందర్‌బాబు, మారిశెట్టి నర్సింగ్‌రావు, యాదగిరిగౌడ్, జానకి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

అడిక్‌మెట్, రాంనగర్ ప్రాంతాల్లో...

రాంనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే దానం నాగేందర్‌ను ప్రజలు గెలిపించాలని ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి ఎం. అరవింద్‌కుమార్‌యాదవ్ కోరారు. శనివారం సాయంత్రం దానం నాగేందర్‌కు మద్దతుగా అడిక్‌మెట్, రాంనగర్ ప్రాంతాల్లో మాస్ పాదయాత్ర జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే అయిదు గ్యారంటీలను అమలు చేశారని అన్నారు. ఎంపీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని కోరారు. బీజేపీ, బీఆర్ఎస్ మోసకారిమాటలను ప్రజలు నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిలు గౌరీశంకర్, పొన్నాడ సుబ్రహ్మణ్యప్రసాద్, నాయకులు తిరుమల్, మనోహర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



అడిక్‌మెట్‌లో ప్రచారం చేస్తున్న ఎన్నికల ఇన్‌చార్జీలు అరవింద్‌కుమార్‌యాదవ్, కె. గౌరీశంకర్ తదితరులు

ఇంటి వద్దే ఓటేసిన వృద్ధులు

రాంనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం 85 సంవత్సరాలు దాటిన సీనియర్ సిటిజన్లకు ఇంటి వద్దే ఓటు వేసే అవకాశాన్ని కల్పించింది. ఈ కార్యక్రమం ఈ నెల 4 నుంచి 7 వరకు జరగనుంది. ముషీరాబాద్ నియోజకవర్గం అడిక్‌మెట్ డివిజన్‌లో శనివారం రాష్ట్ర ఎన్నికల విభాగం అధికారులు పోలింగ్ బాక్సులతో పదిమంది సీనియర్ సిటిజన్ల ఇంటికి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకునేలా చేశారు. లలితానగర్‌లోని సాయిపూర్ణ రెసిడెన్సీలో నివాసముంటున్న పి.సీత (94), రాంనగర్‌గుండుకు చెందిన కేహెచ్‌ఎస్.జగదాంబ (87), లలితానగర్‌కు చెందిన కే.శ్యామ్‌ప్రకాష్‌రావు (90), విద్యానగర్‌కు చెందిన కే.జోగేశ్వర్‌రావు (90), కేశవప్రసాదరావు (85), కమల్‌దేశ్‌పాండే, గోవిందరావు దేశ్‌పాండే, టీ.సత్యనారాయణరావు, వల్లూరి సక్కుబాయి, ఎం.భాస్కరుడు ఓటు హక్కు వినియోగించుకున్నారు.



ఇంటి వద్ద ఓటు వేసి సింబల్ చూపిస్తున్న పి.సీత (94), కెహెచ్‌ఎస్. జగదాంబ (87), కేశవ్ ప్రసాద్‌రావు (84), కె. శ్యామ్‌ప్రకాష్‌రావు (90), జోగేశ్వర్‌రావు (90)

ఇంటి వద్దే ఓటు.. సీనియర్ సిటిజన్లకు వరం

ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం చాలా బాగుంది. సీనియర్ సిటిజన్లు వయోభారంతో పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటేయలేరు. ఓటు హక్కు కోసం ఏప్రిల్ 23న ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేశా. ఎన్నికల సంఘం తనకు ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం కల్పించింది. సీనియర్ సిటిజన్లు ఇంటి వద్దే ఓటు వేసే అవకాశాన్ని సద్వినియోగంచేసుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి.



డాక్టర్ రాజ్‌నారాయణ్‌కు అమెరికా ప్రొఫెసర్ల సత్కారం


డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్‌ను సత్కరిస్తున్న అమెరికా ప్రొఫెసర్లు

బర్కత్‌పుర, మే 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్‌ను అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్ ప్రొఫెసర్లు సత్కరించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో శాలువా, జ్ఞా పికతో సత్కరించారు. యూనివర్సిటీ ప్రొఫెసర్ లావిరి మొగ్రో సత్కారం నిర్వహించారు. డాక్టర్. రాజ్‌నారాయణ్ ముదిరాజ్ 40 ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణ, శాంతి, మతసామరస్యాం, జాతీయ సమైక్యత, ఏయిడ్స్ నివారణ, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నిర్వహించిన కార్యక్రమాలను గుర్తించి ఈ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ మాట్లాడుతూ ఈ సత్కారం తనలో ఆత్మవిశ్వాసం మరింత పెంపొందించిందని సేవలను విస్తృతం చేస్తానన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న మణికొండ వెంకటేశ్వరరావు, లక్ష్మణ్

మున్నూరుకాపు ఎంపీ అభ్యర్థులను గెలిపిస్తాం

● తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ

బర్కత్‌పుర, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తు న్న మున్నూరుకాపు కులస్థులను గెలిపించుకోవడానికి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మంగళారపు లక్ష్మణ్‌లు తెలిపారు. రాష్ట్రంలోని మున్నూరుకాపులు ఓటింగ్‌లో పాల్గొని మున్నూరుకాపు అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. శనివారం కాచిగూడ మున్నూరుకాపు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా ఆదివారం మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్‌లో బండి సంజయ్, జహీరాబాద్‌లో గాలి అనిల్ కుమార్, నిజామాబాద్‌లో ధర్మపురి అరవింద్‌లను గెలిపించాలని వారు కోరా రు. నల్గొండ, వరంగల్, ఖమ్మం ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మహాసభ నాయకులు జితేందర్, కొండూరు వినోద్‌కుమార్, హనుమంతు, భాస్కర్, రవీందర్ పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక చైతన్యానికి బైబిల్ తరగతులు దోహదం

● హెబ్రోన్ సొసైటీ ప్రధాన కార్యదర్శి వీరాచారి



సువార్తర్యాలీలో విద్యార్థులు, నిర్వాహకులు

చిక్కడపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చైతన్యానికి, దైవిక చింతనను పెంచడానికి బైబిల్ తరగతులు విద్యార్థులకు ఎంతగానో దోహదపడ్డాయని హెబ్రోన్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆర్. వీరాచారి అన్నారు. గోల్కొండ చౌరస్తాలోని ప్రముఖ హెబ్రోన్ చర్చిలో 12 రోజులపాటు నిర్వహించిన బైబిల్ తరగతులు శనివారం విజయవంతంగా ముగిసాయి. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ జోసెఫ్ కురియన్, వీటరాచారిలు మాట్లాడుతూ జంటనగరాలకు సంబంధించిన కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులు పెద్దసంఖ్యలో తరగతుల్లో పాల్గొన్నారని వివరించారు. ఆధ్యాత్మిక చైతన్యానికి దైవిక చింతనను పెంచే యేసు ప్రభువు బోధనలు, మానసిక వికాసాన్ని పెంచే అంశాలు చిన్నారులు, యువతకు ఈ తరగతుల్లో వివరించడం జరిగిందని తెలిపారు. అనంతరం సువార్త ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి దైవసేవకులు జోసెఫ్ పి. కురియన్, ఓబెద్ జాన్, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కళాశాలలో ఆకట్టుకున్న గాలా ఫెస్ట్


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో జరిగిన గాలా ఫెస్ట్‌లో విద్యార్థులు

రాంనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాల ఆవరణలో శనివారం కళాశాల గాలా ఫెస్ట్-2024 వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో కళాశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సందడి చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ రిషికాంత్, ప్రిన్సిపాల్ డాక్టర్ మట్టా శేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు ఆటపాటల్లో కూడా రాణించాలని ఇందుకు గాలా ఫెస్ట్ ఉత్సవాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



నేడు సివిల్స్ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

చిక్కడపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని విజన్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. సదస్సులో 2023 ఆలిండియా ర్యాంకర్లు నవనీత్ ఆనంద్(499), హర్షిత్ శ్రీవాస్తవ(521)లు అభ్యర్థులకు సివిల్స్ ప్రిపరేషన్, ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు, ఇంటర్వ్యూ అంశాలపై గైడెన్స్ ఇస్తారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

దేశ అభివృద్ధి మోదీతోనే సాధ్యం: ఆనంద్‌గౌడ్

● బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్


ఇందిరాపార్కులో వాకర్స్‌ను కలిసి ప్రచారం చేస్తున్న కిషన్‌రెడ్డి సతీమణి కావ్య, కార్పొరేటర్ రచనశ్రీ

ముషీరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధి, సంక్షేమం ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. శనివారం భోలక్‌పూర్‌లో బీజేపీ కార్నర్ మీటింగ్ ముషీరాబాద్‌నియోజకవర్గం బీజేపీ మీడియా సెల్ ఇన్‌చార్జి బిజ్జి కనకేష్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాదం అణచివేత, అవినీతి నిర్మూలనకు మోదీ ఎంతో కృషి చేశారు అన్నారు. సికింద్రాబాద్ ఎంపీగా కిషన్‌రెడ్డి మరోసారి విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓటమి భయం పట్టుకుందని అందుకే బీజేపీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.



ఇందిరాపార్కు వద్ద కిషన్‌రెడ్డి సతీమణి ప్రచారం

కవాడిగూడ, మే 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి మద్దతుగా శనివారం ఇందిరాపార్కులో వాకర్స్‌ను కలిసి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య కిషన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోదీ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపికి ఓటు వేసి కిషన్‌రెడ్డిని గెలిపించాలనికోరారు. కార్యక్రమంలో కవాడిగూడ కార్పొరేటర్ జి రచనశ్రీ. మాజీ కార్పొరేటర్ టి రవీందర్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ రమేష్‌రాం, నాయకులు, కార్యకర్తలు, వాకర్స్ పాల్గొన్నారు.

రెండోసారి కిషన్‌రెడ్డి విజయం సాధించడం తథ్యం

గోల్నాక, మే 4 (ఆంధ్రజ్యోతి): ఈ పార్లమెంటు ఎన్నికల్లో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి రెండోసారి భారీ మెజారిటీతో విజయం సాధించడం తథ్యమని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధానకార్యదర్శి సి.కృష్ణాగౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గోల్నాక డివిజన్ ఖాద్రీబాగ్ శక్తికేంద్రం కార్నర్ మీటింగ్‌లో కృష్ణాగౌడ్ పాల్గొని ప్రసంగిస్తూ కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు.







